
# హాస్యమాలిక

VOL-II



సిహెచ్. వి.ఎస్. ఎన్. మూర్తి



చతుర్వేదుల. వెంకటసత్యనారాయణ మూర్తి

# కార్ హార్న్-జన విన్యాసాలు!!

వాహనం నడిపేటప్పుడు మనిషి యొక్క భావోద్వేగాల్ని వ్యక్తం చెయ్యడానికి భగవంతుడు కార్ హార్న్ సృష్టించాడనుకుంటా.కొంతమందికి ఎంత సరదానో అదే పనిగా కార్ హార్న్ మోగించడం ముందు వాహనాలు ఉన్నా లేక పోయినా.బహుశా వాళ్లకు ఉన్న సరదా,ఉత్సాహం, నిరాశ (ఫ్రస్ట్రేషన్) విసుగు (ఫెటీగ్) అసహనం (ఇన్ టాలరెన్స్) కూడా అలా రోడ్డుమీద వ్యక్తం చేస్తూ ఉంటారనుకుంటా-వాళ్ళమొహాలు చూసినప్పుడు అలా అనిపిస్తూ ఉంటుంది!

బహుశా మనిషికున్న అసహనాన్ని ప్రదర్శించడానికి రోడ్డుకన్న మిన్నలేదు కదా- అదీ వాహనం నడుపుతూ! సిగ్నల్ దగ్గర గ్రీన్ లైట్ రాగానే వీళ్లు మైలు దూరంలో ఉన్నా హార్న్ మోగిస్తూనే ఉంటారు.వీళ్లు వేగంగా వెళ్ళాలి కాబట్టి ముందువాడు నెమ్మదిగా వెళ్తుండేవాణ్ణి ఊదర కొట్టేస్తారు-వీళ్లకి దోవ ఇచ్చేంత వరకూ!

ఇంకోరకం మనుషులు వుంటారు- సాధారణంగా రద్దీ ఉన్న రోడ్లమీద వాహనాలు ఒక దాని వెంట ఒకటి వెళ్తుంటాయి-పెళ్లివారి ఊరేగింపులా -మనం కూడా గుంపులో గోవిందా అనుకుంటూ మెల్లిగా సాగిపోవాలి- ఆహా... అలా ఉండరు వీళ్ళు- కొద్ది ఖాళీ కనపడితే హార్న్ వేస్తూనే ఉంటారు-ముందు వాహనాన్ని దాటుకుంటూ వెళ్లిపోదామనే.

మరో విచిత్రమైన వీరులు ఉంటారు- దూరంనుంచే హార్న్ వేసుకుంటూ వస్తారు- "గంటల బండి"లాగా (ఫైర్ ఇంజిన్) హార్న్ వేసేవాడికి గానీ, వాడి ఇంట్లోవాళ్లకి గానీ ఏదో ప్రమాదఘంటికలు మోగాయని భావించి మనం దారి ఇవ్వాలి-మన వాహనాన్ని నడుపుకుంటూనే పక్కకి జరిపి, లేదంటే మన వాహనాన్ని కొట్టుకుంటూ వెళ్లిపోతారు.

ఇంకో విచిత్రమైన అలవాటు ఉన్న వాళ్ళూ ఉన్నారు లెండి- మనము నిత్యం రోడ్డు మీద చూస్తూనే ఉంటాం.ఏదైనా "అంబులెన్సు వాహనం" కనపడితే చాలు, జనాలు దానికి దారి ఇస్తారుగా- అంతే... దాని వెనకే ఆ అంబులెన్సుని వెంబడిస్తూ వెళ్తారు తమ వాహనంలో- అక్కడికేదో ఆ అంబులెన్సులో ఉన్నవాళ్ళు వీళ్ళ బంధువులే అన్నట్టుగా!

ఇంకోరకం మనుషులున్నారు-ఎవరైనా "టోల్ గేట్" దగ్గర ఎందుకు ఆగుతారు- అదేమైనా "కేఫే కాఫీ డే"నా-కబుర్లు-కాకరకాయకి,కాఫీకి ఆపటానికి. సాధారణంగా గేట్ దగ్గర సెన్సర్ "కార్ ఫాస్టాగ్" ని కనిపెట్టిన తర్వాత గేట్ పైకి లేస్తుంది- ఈ ప్రక్రియ పూర్తవడానికి కొన్ని సెకండ్లు పడుతుంది.

ఏదైనా కారణాన ఆటో సెన్సర్ పనిచేయకపోతే ఆ మనిషి హ్యాండ్ సెన్సర్ తో కార్ దగ్గరకు వచ్చి సెన్సర్ తో చెక్ చేయగానే గేట్ తెరుచుకుంటుంది.ఈ సంగతి చదువులేని వాడికి కూడా తెలుసు- కానీ కొంతమంది చదువుకున్నపోటుగాళ్ళు మాత్రం వెనకనుంచి హార్న్ వేస్తూనే ఉంటారు- వీళ్ళని ఏమనాలి!

కొంత మంది రాజకీయ నాయకులు,వాళ్ళ అనుంగు శిష్యులు,కొడుకులు, పైరవీకారులు వీరంగం స్తేంటారు టోల్ గేట్ దగ్గర.వీళ్ళు హార్న్ వేయటం గట్రా లాంటివి ఉండవు-"గవర్నర్ కార్ ముందు పైలట్ కార్" అనుకుంటారు వాళ్ళ వాహనాన్ని- గేట్ పగలగొట్టు కుంటూ కూడా వెళ్లిపోతుంటారు- వీళ్ళలో కొందరు.

పేపర్లో లోనూ, టి.వి లోనూ మనం చూస్తూనే ఉంటాం- వీళ్ళ పవర్,ప్రతాపం ఈ టోల్ గేట్ దగ్గర అర్భకుల మీద చూపిస్తుంటారు- "పిచిక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు" అధికార దర్పం-పొగరు అంటే అదే మరి. జనం యొక్క అసహనం అంతా మన దేశపు రోడ్లమీద నిత్యం చూస్తూనే ఉంటాం; వీళ్ళే చాలా అసహనంతో"సహనంగా ఎలా ఉండాలో"అని జనాలకి క్లాసులు పీకుతుంటారు!

ఇన్ని విచిత్రాలు, విన్యాసాలు, పోకడలు, నిత్యం చూసిన తరవాత మనం కూడా ఇలా మారిపోతూ ఉంటాం ఒక్కొక్క సారి- మనకు ఇష్టం లేక పోయినా-ఇది మరి అంటువ్యాధాయే.ఎంచేతంటే పైన చెప్పినవాళ్ళ మీద ఉన్న కసి- వాళ్ళని ఏం చేయలేము కదా- మన ఉక్రోషం అంతా ఆ విధంగా వికారంగా మారిపోతూఉంటుంది మరి-మనకు తెలియకుండానే!

ఒక్కొక్కసారి ఈ వికారాల ప్రభావం ఆఫీస్ వాళ్ళ మీద, ఇంట్లోవాళ్ళ మీద కూడా చూపించడం కద్దు- మనం ఏమైనా మానవాతీత శక్తులు ఉన్నవాళ్ళం కాదుగా- మనమూ సగటు మనుషులమే కదా మరి!

ఏది ఏమైనా కార్ హార్న్ వేయడం ద్వారా మనం అవతల వాళ్లతో మన భావాలు వ్యక్తం చేస్తున్నట్టే.అంచేత అప్పుడప్పుడు మనం కూడా ఇలా చేసినా పెద్దగా బాధ ఇబ్బంది పడక్కర్లా- ఆ భాషేదో మనకూ వచ్చేసినట్టే మరి!

# దేవుడితో ముచ్చట్లు...

ఇంతకు మునుపు మీకు చాలా సార్లు చెప్పానుగా నాకు మహాదేవుడి దగ్గర,శ్రీ మహా విష్ణువు దగ్గర కాస్త అలవాటు, చనువూ ఉంది అని.అప్పుడప్పుడు మా కబుర్లు, మీకు నా ద్వారా ఆయన  చెప్పమన్న కబుర్లు కూడా  గత ఐదారేళ్లుగా అందిస్తూనేవున్నా-మీలో కొందరికన్నా గుర్తుండే ఉండాలి!

ఆయనతో నాకున్న చనువుతో నిన్న పడుకునేముందు శ్రీమహావిష్ణువుని మన బాలు గురించి అడిగాను! దానికి ఆయన "నేనూ శ్రీలక్ష్మి ఈ మధ్య బాలు పాటలు వింటున్నప్పుడు ఓపాట విని ఇద్దరం చలించి, కదిలిపోయాం" అన్నాడు!

"అదేమీ పాట స్వామీ" అని అడిగాను!  "అంతర్యామీ-అలసితి, అలసితి" అని చాలా వేదనగా పాడాడయ్యా- ఇక మేము ఆగ లేకపోయాం, మాఇద్దరి కళ్ళవెంటా అశ్రుధారలే- ఇక ఆగలేక మహాదేవుడికి కబురు చేశా, తక్షణమే బాలుని తీసుకొచ్చేయమని. ఆ విషయం బ్రహ్మ చెవిలో వేసాడనుకుంటా; ఆయన అదిరిపడి నా దగ్గరకు వచ్చేసాడు.

వస్తూనే "అదేమిటి ప్రభూ, బాలుకి ప్రత్యేకంగా "నిండు నూరేళ్ళ ఆయుర్దాయం" ఇచ్చి పంపింది మీరే కదా, ఇలా ఇప్పుడు అర్ధాంతరంగా, ఉన్నపళంగా తెచ్చేయమని మహాదేవునితో అన్నారట- ఇది ధర్మ విరుద్ధం కదా" అన్నాడు.

"ఆ బాలూయే అలసిపోయాను మొర్రో అంటుంటే అని విధాతని నాలుగు చివాట్లు పెట్టి బాలుని గాంధర్వలోకానికి తెప్పించేసాను"ఆ వృత్తాంతం అంతా నా చెవిన వేసాడు పరమాత్మ- అప్పుడు నాకు ఓ చిన్న సందేహం వచ్చింది. "స్వామీ బాలు అలిసిపోయే మనిషి కాదే" అన్నాను,దానితో శ్రీమహావిష్ణువుకు కొద్దిగా కోపం వచ్చినట్టుంది; "అంటే నీ ఉద్దేశం ఏంటీ అన్నట్టు" మొహంపెట్టాడు నావంక.

అప్పుడు నేను ధైర్యం తెచ్చుకొని "స్వామీ ఆ పాట బాలు పాడిన మాట వాస్తవమే; కానీ అది అన్నమయ్య గొంతులో పలికించాడు ఆర్తిగా,అది మీరు "శ్రీనివాసుడి అవతారంలో" ఉండగా అన్నమయ్య పాడిన పాట,పాడింది బాలూయే- వేదన మాత్రం అన్నమయ్యది-అది బాలు వేదన కాదు" అన్నాను.

"భూలోకంలో బాలు అభిమానులు, ఆప్తులు కుటుంబ సభ్యులు అల్లాడి పోతున్నారు-ఆయన క్షేమంగా ఇంటికి తిరిగివస్తాడు అని అనుకుంటుంటే-ఈ హఠాత్పరిమాణానికి", అనికూడా అన్నాను- ఆయన మోహంలో రంగులు మారటం గమనించి!

నా సమాధానంతో ఆయన మొహం కొద్దిగా ఇబ్బందిగా పెట్టాడు,ఎంతైనా దేవదేవుడు కదా ఆయన చేసిన పొరపాటు ఒప్పుకోడుగా నాకు ఎంత అలవాటు అయినా! "పోనీలెవయ్యా ఇంకోసారి బాలుని వేరే రూపంలో మళ్ళీ భూలోకానికి పంపిస్తాలే గాంధర్వలోకంలోనే ఉన్నాడుగా- వచ్చినవాడు ఎలాగూ వచ్చాడు- కొన్నాళ్ళు ఊపిరి తీసుకోనీ,సేద తీరనీ" అన్నాడు.

ఆ మాటతో పూర్తి ధైర్యంతో అడిగేశా "స్వామీ ఇది ఇప్పుడు జరిగేదేనా- నేను చూస్తానా" అని! దానికి ఆయన భరోసాగా "నువ్వు వైకుంఠానికి వచ్చే సమయం ఆసన్నం అయ్యేలోపు అతన్ని నీకు చూపించే పూచి నాది-లేకపోతే నువ్వు ఊరుకుంటావా గోల చేయ్యవూ-అయినా మనం కలుస్తూనేవుంటాం కదా బాలు విశేషాలు కూడా చెప్తాలే"అని నవ్వుతూ అన్నాడు.దాంతో చాలా సంతోషంగా ఆయనకు సాష్టాంగ ప్రమాణం చేశా, కరోనా సమయం కదా ఆయనకూ నాకూ వేళాపాళా లేదు- నిద్రకీ, తిండికీ,లేవడానికి, కబుర్లకి -ఆయన అంతర్ధానమయ్యాడు-నేను నిద్రలోకి జారుకున్నా.

అదర్రా సంగతీ-నా వయసువాడికే భరోసా ఇచ్చాడు అంటే చాలామందికి బాలుని మళ్ళీ వేరే రూపంలో చూడటానికి అవకాశం ఉంది ఖచ్చితంగా! "గంధర్వుడు" కదా తన ఉనికి సహజంగానే ప్రపంచానికి తెలియ చేస్తాడు ఏ రూపంలో ఉన్నా-ఎక్కడ ఉన్నా!

ఈ విషయం మీకు పొద్దున్నే చెప్పాలనుకున్నాకానీ -ఇంట్లో ఉండే రోజూవారి పనుల్లో, ఇంకా "హైదరాబాద్ జ్ఞాపకాలు" "బాలు మూలాల మీద సవరణ" రాయడంతో తీరిక దొరకలా-అంచేత ఈ సాయంకాలం అన్నాఇలా మీ చెవుల్లో వేద్దాం అనుకున్నా ఇంకా ఆలస్యం చేయకుండా-లేకపోతే ఈ రాత్రి ఓ పట్టాన
నిద్రపట్టి చావదుగా మరి!

ఈ శుభవార్తని ఆయన మాటగా మీ వాళ్లందరికీ చెప్పండి;ఉంటా మరి- నాకైతే చాలా తృప్తిగా ఉంది!

## ఇరువురు దంపతులు "ఒకేసారి పోయే" సదుపాయం....
## వేదిక: యమలోకం

యమలోకంలో యమధర్మరాజు తన ముఖ్యమైన సిబ్బందితో "రహస్య సమావేశం" ఏర్పాటు చేసాడు- చర్చించబోయే విషయం చాలా సున్నితమైనది అవటంవల్ల. ముఖ్యమైన వాళ్ళందరూ వచ్చేసారు,అప్పుడు యమధర్మరాజు మాట్లాడటం మొదలుపెట్టాడు.

ఈ మధ్యకాలంలో మనవాళ్ళు భూలోకానికి మానవుల ప్రాణాలు తేవడానికి వెళ్తున్నప్పుడు కొంత వింతమాటలు మనవాళ్ళు వింటున్నారట-భర్త పోయినప్పుడు-భార్య, భార్య పోయినప్పుడు భర్త అనుకోవడం- ఈ విధంగా అనుకుంటున్నారట:

"ఆయన పోయిన తర్వాత జీవితం బతకడం కష్టం మరియూ వృధా ఒక్కళ్ళే బతకాలంటే-వాళ్ళమీద వీళ్ళమీద ఆధారపడి బతుకు వెళ్ళదీయాలి-దాని బదులు ఆ భగవంతుడు ఇద్దర్ని ఒకేసారి తీసికెళ్తే బాగుండును"అని.

"ఇన్నాళ్లూ నా అలానా పాలనా అన్నీ తానే చూసుకునేది,ఒంటరిగాణ్ణి ఎవరిమీదో ఆధారపడుతూ బతకాలి"అని-ఇదే మాట భర్తలు కూడా అనుకుంటున్నారట- వాళ్ళ భార్యలు పోయినప్పుడు-కొంతమంది మనసులో, మరికొంతమంది తమ తమ బంధువులతో! బహుకొద్దిమంది మాత్రం "ఈ సదుపాయం ఉంటే ఎంత బాగుండు" అని కూడా!

ఈ మాట యమధర్మరాజు చెప్పగానే పరివారం చాలా ఆశ్చర్యంగా,నమ్మశక్యంగా లేనట్లు చూసారు. అధికారుల్లో కొందరు మాత్రం కొద్దిగా ఇబ్బందిగా మొహం పెట్టారు యముడి మాట విన్న తక్షణం- అందరితో బాటు ఆశ్చర్యపడుతూ!

యమధర్మరాజు ఇలా అడిగాడు వాళ్ళ మొహాలు చూసి "ఏమిటయ్యా మీరు మొహాలు అలా పెట్టారు దిగాలుగా,మానవుల మనసులోని కోరికలు విన్నతర్వాత- ఆ దంపతుల మధ్య ఉన్న ప్రేమా అన్యోన్యానికి సంతోషించాల్సింది పోయి"

"మహా ప్రభు ఇది నిస్సందేహంగా సంతోషించ తగ్గ విషయమే,కానీ ఇప్పడిదాకా భార్య భర్తల్లో ఒక్కళ్ళే వస్తున్నారు- ఎక్కడో నూటికో కోటికో తప్ప.ఇప్పుడు వీళ్ళు జంటలు జంటలుగా వస్తే, వీళ్ళని ఉంచడానికి ఏర్పాట్ల గురించే మా బెంగ,ఇంత రద్దీ ఒక్కసారే పెరిగితే" అని ముక్తకంఠంతో అన్నారు- ఏదో బృందగానంలాగా!

అదీకాకుండా దాదాపుగా ఏడాదినించి మనవాళ్ళకి తాకిడి ఎక్కువయిపోయింది - భూలోకానికి వెళ్లి రావడం-ఈ కొత్త వైరస్ వల్ల.జనాలు ఇబ్బడిముబ్బడిగా పోతున్నారు-ఒక ఊరా,ఒక రాష్ట్రమా,ఒక దేశమా! భూగోళం మొత్తం మనవాళ్ళు ఇట్టే వెళ్తున్నారు,వస్తున్నారు ఎడతెరిపి లేకుండా -అయినా మీదాకా తీసుకు రాలేదు ఈ విషయాన్ని!

"అదీ కాకుండా-మీకు తెలియని విషయమేమీ కాదు,ఎవరి ఆయుష్షు వాళ్లదే వాళ్ళవాళ్ళ పూర్వజన్మల కర్మఫలం వల్ల-అలాంటిది ఇద్దర్ని ఒక్కసారే ఎలా తెస్తాం ఇక్కడికి.వీళ్ళ కోరికవల్ల మనకు- కాదు బ్రహ్మగారికి గట్టి ఇబ్బందే" అన్నాడు ఓ అనుభవజ్ఞుడైన అధికారి-కాస్త బ్రహ్మగారి పేరు వాడుకుంటే మంచిది అన్నట్టు! (డిజిటల్ యుగపు మానవుల్ని చూస్తున్నాడు కదా-వాళ్ళ దగ్గర నేర్చుకుని ఉంటాడు ఈ తెలివితేటలు)

అప్పుడు యముడు "ఓర్నీ అసాధ్యం కూలా ఇవి ఆ మానవులు అనుకునే మాటలు మాత్రమే-అది కూడా కొద్దీ మందే-ఇవి "తథాస్తు" అవ్వాలంటే ముందు మన అందరిలో ఏకాభిప్రాయం రావాలి,అందుకనేగా ముందుగా ఈ విషయాన్ని మీ ముందు ఉంచాను-తర్వాత కదా త్రిమూర్తుల దగ్గరకు వెళ్ళాలి "పెద్దాయన" ఒప్పుకోవాలి"

అని ఆపి "దీనికి మాత్రం ఎంత తతంగం ఉందనుకున్నారు; ఆయన మాత్రం వెంటనే సరే అనలేడుగా- బ్రహ్మతో, శివుడితో మాట్లాడాలి-తుది నిర్ణయం ఆయన తీసుకున్నా.మన గురువుగారయిన మహాశివుడికి పెద్ద ఇబ్బందేం లేదు, మనం ఒప్పుకుంటే- మనం సామర్ధ్యంతో వచ్చేవాళ్లకి ఏర్పాట్లు అవి చూసుకోగలం అంటే" అన్నాడు-ఇంత చెప్తున్నా ఆ అధికారులు మొహాలు చిన్నబుచ్చుకునే ఉన్నారు!

అప్పుడు యముడు "మీరేం అంత కంగారు,ఆదుర్దా పడబోకండి,బ్రహ్మగారు ఈ ప్రతిపాదనకు ఒప్పుకుంటాడనే నమ్మకం నాకులేదు.ఇలా ఒకళ్ళకు బదులు "భార్య భర్తలు" ఇద్దరూ వస్తాం అంటే ఆయన సృష్టిచేసే వేగం పెంచాలి- ఆయన సిబ్బందిని పెంచుకోవాల్సివస్తుంది మనలాగే.ఇంకో ఇబ్బంది ఏమిటంటే ఆయన భార్య- "సరస్వతమ్మ" ఇప్పటికే సణుగుతోందని వాళ్ళ సిబ్బంది ద్వారా నాకు కబుర్లు అందుతున్నాయి- "బ్రహ్మగారు ఎక్కువ సమయం ఆవిడతో గడపట్లేదని"

(లోగొంతుకతో అన్నాడు- చిదంబర రహస్యంలాగా (చిదంబరం కూడా మహా శివుడిదే కదా)

ఆ మాట విన్న తర్వాత ఆ అధికార్ల మొహాలు కాస్త కుదుటబడి పూర్వపు స్థాయికి వచ్చాయి.ఇది చూసి యముడు కాస్త ఉత్సాహం తెచ్చుకుని చెప్పడం సాగించాడు!

"ప్రపంచంలో ఇప్పటికే జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నారు రోజురోజుకీ- బ్రహ్మగారు ఆయన భార్యాపిల్లలతో గడిపే సమయం తగ్గిపోతూ వస్తోందని- సరస్వతిదేవి ఈ మధ్య రుసరుసలు పెంచిందిట. ఇక జంటలుజంటలుగా ఇలా వచ్చేస్తే- ఈయన ఇక సృష్టివేగం పెంచాలి కదా,దానితో ఆయనకీ పనిభారం పెరుగుతుంది కూడా - వాళ్లిద్దరి మధ్య గొడవలు పెరిగిపోతాయి;ముందు మీ అభిప్రాయం చెప్తే అప్పుడు ఆలోచిస్తా అసలు ఈ ప్రస్తావన శ్రీ మహావిష్ణువు దగ్గరకి తీసుకెళ్ళాలా లేదా అని" అన్నాడు. కాస్సేపు నిశ్శబ్దం ఆవహించింది ఆ మందిరంలో-కొంతసేపటి తర్వాత ఓ అధికారి- వాళ్లలో ఓ అనుభవజ్ఞుడు అనుకుంటా-

"ఇంత వరకు బాగానే వుంది ప్రభూ, మీ మాట మేము ఏరోజూ కాదనలేదు మాకు చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నా నిర్విరామంగా పనిచేస్తూనే ఉన్నాం.కానీ ఈ విషయంలో మా అభిప్రాయం ఏమిటంటే- మీరు ఈ ప్రతిపాదన ఎంచక్కా పైవరకు తీసుకెళ్లండి- నిక్షేపంగా"- అని చెప్పి ఒక క్షణం యముడి వేపు చూస్తూ...

"ఒక వేళ వాళ్లందరికీ సమ్మతం అయితే-మాకు కొద్దిగా సిబ్బంది,ఆర్థిక వనరులు- మీరు కాదనకుండా ఖర్చుకు వెనకాడకుండా ఇవ్వాలి.ఇది శాసనం అయితే దాని ప్రకారం మా విషయపట్టికలోనూ, అన్ని విభాగాల కార్యక్రమపట్టికలోనూ దానికి అనుగుణంగా మార్పులు చేసుకుంటాం.అలాగే దాన్ని అమలుపరచే ముందు మన సిబ్బందికికూడా ముందే చెవినవేసి ఈ మార్పులకు తగ్గట్టుగా వాళ్ళని తయారయి వెళ్ళమంటాం భూలోకానికి అదనపు సరంజామాతో -మళ్ళీ అటూఇటూ హైరానాతో తిరగకుండా!"

చివరగా చిత్రగుప్తుల శాఖాధికారి తన గోడు వెళ్లబోసుకున్నాడు! "మహా ప్రభూ మీరు ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది; దేవేంద్రునికి ఈ మార్పువల్ల వీసమెత్తు కాదు, ఆవగింజంత కూడా తేడా ఉండదు.ముందుగా మనవాళ్ళే కదా అందర్నీ తేవాల్సింది.ఇక్కడ చిత్రగుప్తుల వారి కింద పనిచేసే మేము కదా - పాపపుణ్యాల బేరీజు వేసేది.అది అయిన తర్వాత కదా మనం పుణ్యాత్ములని స్వర్గానికి పంపడం జరిగేది.మా పనిభారం పెరుగుతుంది,ఆయనకేం నాట్యమంటపంలో రంభ, ఊర్వశి, మేనకా తిలోత్తమల నృత్యాలు, విందులూ వినోదాలూనూ"

"కాస్త మీరే ఒడుపుగా, లౌక్యంగా ఈ అంశాన్ని త్రిమూర్తుల దగ్గర ప్రస్తావించి వ్యవహరించాలి, ఏదో పనిభారం పెరుగుతుంది కదా అని మేము ఈ మానవుల కోర్కెను తృణీకరిస్తున్నామనో,వ్యతిరేకిస్తున్నాం అనో అనుకోవద్దు" అని అన్నాడు. చిత్రగుప్తుడు అతని వైపు మెప్పుకోలుగా చూసాడు!

ఆ మాటలు విన్న యముడు సంతుష్టుడై అందరికి అభయం ఇచ్చి సమావేశాన్ని ముగించాడు.స్వర్గాధిపతి ఇంద్రుడికి కబురు పెట్టాడు తన సొంత ఆంతరంగికుని ద్వారా విషయ సూచన చేస్తూ.అలాగే త్రిమూర్తుల నుండి కబురు అందగానే ఆయనకి నిర్ధారణ చేస్తానని ఎప్పుడు వైకుంఠానికి రావాలో అనీనూ కూడా!

మరునాడు యమధర్మరాజు “బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు” కబురు పెట్టాడు- ముగ్గురిని ఒకసారి కలవాలని, వాళ్ళవాళ్ళ వీలు చూసుకుని సమయం నిర్ధారిస్తే వచ్చి విషయం సావధానంగా చర్చిస్తానని.అందునా ఈ మానవులు ఊరకనే వుండరు కదా అంగారక గ్రహం మీద నివాసాలు ఏర్పాటుచేద్దాం అనుకుంటున్నారు- మళ్ళీ అది వేరే అని అనుకున్నాడు మనసులో!

త్రిమూర్తులు ముగ్గురికి ఒకేసారి వీలుకావాలంటే సామాన్యమైన విషయమేం కాదుగా మరి,కొద్దిగా ప్రత్యామ్నాయాల్ని ఏర్పాటుచేసుకోవాలి ఎవరికి వాళ్ళే. సరిగ్గా వారం రోజుల తర్వాత యముడికి కబురు అందింది ఆయన రావచ్చని దేవేంద్రునితో బాటు;అదే విషయం తన వార్తాహరుడి  ద్వారా ఇంద్రుడికి తెలియచేస్తూ ఆయన్ని మరునాడు సమావేశ సమయానికి తిన్నగా వైకుంఠానికి వచ్చేయమన్నాడు.

రేపటి దాకా వేచి చూద్దాం వైకుంఠంలో జరగబోయే సమావేశం గురించి- ఎంతైనా విషయం మన గురించి కదా- అందాకా ఓపిక పడదాం మరి!

## సశేషం

## రెండవ భాగం
## వేదిక: వైకుంఠం

మరునాడు యమధర్మరాజు వైకుంఠానికి పయనమయ్యాడు, ప్రధానద్వారం దగ్గర ఇంద్రుడు కూడా కలవడంతో- “నిర్వాహణ నియమాలు,దౌత్య మర్యాదల” అనంతరం (ప్రోటోకాల్) యమధర్మరాజు, ఇంద్రుడు వైకుంఠంలోని “ఆంతరంగిక సమావేశాల మందిరానికి” చేరుకున్నారు- అప్పటికే విధాత,మహాశివుడు, విష్ణుమూర్తి ముచ్చట్లాడుకుంటున్నారు.

వీళ్ళిద్దరిని చూడగానే త్రిమూర్తులైనా కించిత్ గర్వంలేకుండా యమునికి,ఇంద్రునికి ఉచితాసనాలు చూపించారు (లేనిపోని దర్పాలు, వెధవ్వేషాలన్నీ మనకే అనుకుంటా) త్రిమూర్తులకు వందనాలు సమర్పించి తమకు ఉద్దేశించిన ఆసనాల్లో యమధర్మరాజు,ఇంద్రుడు ఆసీనులయ్యారు -ఉభయకుశలోపరి అయిన తర్వాత!తిన్నగా వెళ్ళగానే విషయం మొదలుపెట్టకుండా.

మహావిష్ణువు యముణ్ణి ఉద్దేశించి “ఏమి యమధర్మరాజా భూలోకపు కబుర్లు, ఏదో ప్రత్యేక మైన విశేషం ఉంటే గాని మీరు మా ముగ్గురికి కబురుపెట్టరు కదా, అందునా ఇంద్రుణ్ణి కూడా వెంట తెచ్చావు ఏమిటి విశేషం " అని నవ్వుతూ అడిగాడు.

“మహాప్రభూ, త్రిమూర్తులైన మీకు తెలియని విషయం ఉంటుందా- ప్రతీ ఒక్కరి మనసులో భావనలు ఇట్టే పసికట్టేస్తారు కదా” అన్నాడు వినయంగా చిరు నవ్వుతో,వాళ్ళ ముగ్గుర్ని ఉద్దేశించి తన మాటలు మొదలుపెట్టాడు  యమధర్మరాజు!

“మహానుభావులారా భూలోకంలో మానవులంతా తీరుబడిలేకుండా ఉరుకులు పరుగులతో బతికేస్తున్నారు. సంపాదన, వారి భవిత, వారి పిల్లల భవిష్యతే ధ్యేయంగా- భూమండలం చాలా ప్రగతి సాధించింది కూడా- మానవుడు అధిరోహించని రంగం లేదు-అంగారకగ్రహం మీద కూడా నివాసానికి ప్రయత్నాలు చేస్తున్నాడు, ఇవన్నీ మీ ఎరుకకు రాని విషయాలేమీ కావు” అని చెప్పి లిప్తకాలం ఆపి మళ్ళీ తన మాటలు కొనసాగించాడు.

“అయినా కూడా వారిలో దైవ చింతన, భక్తి భావాలు మెండుగానే ఉన్నాయి,అవే కాస్త సేద తీరుస్తున్నాయి వాళ్ళని- విసిగి వేసారినప్పుడు వాళ్ళ ఉరుకుల పరుగుల జీవితంలో” అప్పుడు “విరించి”  "మరి ఇంక ఇబ్బందే లేదు కదా" మీరాకకు కారణం అన్నట్టుగా మందస్మిత వదనంతో అడిగాడు!

అక్కడికే వస్తున్నా అన్నట్టుగా యముడు"త్రిమూర్తులారా ఈ మధ్యన మనవాళ్ళు భూలోకానికి చేసే రాకపోకలలో కొత్త అనుభవం చూస్తున్నారు మానవులలో.జీవి
ఆయుష్షు అవ్వగానే మనవాళ్ళు అక్కడకి చేరుకొని ఆ శరీరంలో ఉన్న జీవాత్మని తెచ్చేటప్పుడు పోయిన తమ జీవితభాగస్వామి గురించి వాళ్ళు అనుకునే మాటలు వాళ్ళ చెవిన వేసాడు"

ఆ మాటలు విన్న త్రిమూర్తులు "ఆహా,ఇది నమ్మశక్యం కాకుండా ఉన్నదే ఈ కలికాలంలో"అన్నట్టుగా ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

అప్పుడు మహాశివుడు"వాళ్ళ కోరిక సమంజసమే కాకుండా మెచ్చతగినదిగా ఉంది,అది అమలుపెట్టటానికి నాకు ఏ మాత్రం అభ్యంతరం లేదు" అన్నాడు.

తక్షణమే బ్రహ్మదేవుడు కల్పించుకుని "మహాశివా నీవు లయకారకుడివి కాబట్టి నీకు అది చాలా తేలికైన విషయమే, నీదేముంది, యమధర్మరాజు ఉన్నాడుగా టక్కున అమలుచేయడానికి- నీతపస్సుకి, ధ్యానానికి,కైలాస నాట్యానికి ఏ భంగం లేదు కదా" అని నవ్వుతూ, "అసలు ఇబ్బంది అంతా నాదే కదా" అన్నాడు.

వీరి సంభాషణలు వింటూ చూస్తున్న శ్రీ మహా విష్ణువు చిరునవ్వు నవ్వాడు బ్రహ్మని కొనసాగించమన్నట్టుగా సంజ్ఞ చేస్తూ!

"ఏ జీవియొక్క పాపకర్మల ప్రకారం వారివారి ఆయుష్షు నిర్ధారిస్తాను.అలాగే ఎవరికి ఎవరితో ఋణానుబంధం ఉంటుందో అనేవి కూడా పరిగణలోకి తీసుకొని ప్రతీ జీవిని తయారుచేసి, ప్రాణంపోసి భూలోకానికి పంపుతాను.ఈ మానవుల కోరిక అభిలషణీయమే అయినా ఆచరణలో కష్టం"

"ఎవరికి ఎవర్ని ఎక్కడ కలపాలో అన్నీ నేనురాసిన ప్రకారం జరుగుతాయి- అందుకనే ఎవరు భూమండలంలో ఏమూల ఉన్నా నా లెక్కలప్రకారం వాళ్ళు కలవడం జరుగుతుంది-వాళ్ళు ఊహించుకోలేనట్లు. ఇదంతా చాలా పెద్ద పని, చిటికలో అయ్యేదికాదు-మీ వాళ్ళు వాళ్ళప్రాణాలు తెస్తున్నట్టు !" అన్నాడు. శంకరుని వైపు చూస్తూ!

"అదీ కాకుండా అల్పాయుష్కుల్ని దీర్ఘాయుష్కులుగా,దీర్ఘాయుష్కుల్ని అల్పాయుష్కులుగా చేయడం ధర్మ విరుద్ధం- ఆ సంగతి మీకూ తెలుసు. భార్యాభర్తలను- వాళ్ళ సంతానాన్ని, ఆప్తుల్ని, ఇతరులతో బంధాలని- ఋణానుబంధం ప్రకారం సృష్టిస్తాగానీ-అదే ఆయుః పరిమితి ఉన్నవాళ్ళని, ఎవరినిపడితే వాళ్ళని భార్యాభర్తలుగా చేయడం కుదరదు కదా" అన్నాడు.

వారి ఇరువురి సంభాషణలు అయిన తర్వాత మహా విష్ణువు వైపు చూసారు, మీ అభిప్రాయం ఏమిటి అన్నట్టు. అప్పుడు శ్రీమహావిష్ణువు“మానవుల ప్రవర్తనలో, ఆలోచనలలో మార్పులు సహజం-కొందరికి ఈ కోరిక ఎందుకు కలిగిందో!నడుస్తున్న ఒరవడిలో ఏచిన్న మార్పు తేవాలన్నా సుదీర్ఘంగా ఆలోచించాలి; అయినా ఇదేదో మన ఇంటి వ్యవహారం కాదు, సృష్టి –స్థితి-లయలకు సంబందించినది.ఒక్క మానవులనే కాకుండా సకల జీవరాశులని కూడా దృష్టిలో పెట్టుకుని నడిపే వ్యవహారం" అన్నాడు.

శివుడు బ్రహ్మ ఇద్దరు ఓకేసారి "మరి ఇప్పుడు ఏం చేద్దాం” అన్నారు,విష్ణువు వైపు చూస్తూ ఆయన్ని ఉద్దేశించి. "ఇది సృష్టికార్యం కాబట్టి మన భార్యలతో సంప్రదించి వాళ్ళ అభిప్రాయం కూడా కనుక్కుందాం, మన నిర్ణయం పక్షపాత ధోరణిగానూ,ఏకపక్షంగానూ ఉండకూడదు కాబట్టి.అందుచేత రేపు మళ్ళీ మన అందరం కలుద్దాం లక్ష్మి, సరస్వతి, పార్వతుల అభిప్రాయలు కూడా విని” అన్నాడు-వారివురు సరే అని అన్నారు.

దానితో యమునికి,ఇంద్రునికి విషయం అర్థం అవటంతో మరునాడు కలుస్తాము అని వారి ముగ్గురి దగ్గర సెలవు తీసుకుని వారిరువురు వాళ్ళ స్వస్థలాలకు  బయలుదేరి వెళ్లారు.బ్రహ్మ సత్య లోకానికి,శివుడు కైలాసానికి మహావిష్ణువు తన అంతఃపురానికి వెళ్ళిపోయారు.

త్రిమూర్తులు వారివారి భార్యలతో చర్చించటానికి మనమూ ఒకరోజు సమయం ఇద్దాం.రేపు వేకువకల్లా నా చెవిన ఎలాగూ వేస్తారు అసలు విషయాన్ని.దాని ప్రకారం దీనికి ముగింపు పలుకుతారేమో వేచిచూద్దాం-రేపటిదాకా వేచిచూద్దాం అందరం!!

## అందుకే మరి ఇప్పటికి సశేషం!

## మూడవ భాగం
## వేదిక: సత్య లోకం

బ్రహ్మ, సరస్వతితో ఈరోజు వైకుంఠ సమావేశంలో జరిగిన విషయాలు అన్నీ పూసగుచ్చినట్లు చెప్పి తన దేవేరి అభిప్రాయం అడిగాడు.దానికి వాఘ్దేవి "నాకైతే ఈ కోరిక సమంజసంగా అనిపించడంలేదు.వాళ్ల కోరికని ఈడేర్చితే ఆ దంపతులలో ప్రాణాలతో మిగిలిన భాగస్వామి కర్మలు ఎవరు చేస్తారు- ఆ జీవిని కూడా యముడు తీసుకువచ్చేస్తే.అదీ కాకుండా ఎక్కడో లక్షకో, కోటికో ఇలా దంపతులు ఇద్దరు ప్రాణాలు విడవడం జరుగుతుంది వారి ఆయుర్దాయం అయిపోతుంది కాబట్టి- ఆలాకాక బలవంతాన ఇంకా ఆయువు ఉన్నవాళ్ళని తేలేరు కదా!

అప్పుడు విధాత సరస్వతిని మెచ్చుకోలుగా చూస్తూ "నేనూ ఇదే సందేహం, అభిప్రాయం వ్యక్తం చేసాను దేవి ఈ రోజు సమావేశంలో"అని అన్నాడు.అప్పుడు సరస్వతిదేవి ఈ విధంగా అంది "మీరు ఒక పని చేయవచ్చు, జీవితభాగస్వామిని కోల్పోయిన తర్వాత దశదిన కార్యక్రమం వరకు ఆగండి.అప్పటికీ జీవించి ఉన్న ఆ జీవితభాగస్వామికి ప్రాణాలు విడవాలనే కోరిక ఇంకా బలీయంగా ఉంటే వాళ్లకి ఉన్న మిగిలిన ఆయువు మీరు వాళ్లకి రాబోయే జన్మలో ఇవ్వండి.ఈ మాత్రం సర్దుబాటు మీరు చేసుకుంటే మీకు ఇబ్బందీ ఉండదు,వాళ్ల కోరికా తీరుతుంది" అంది. బ్రహ్మకు ఇది అద్భుతమైన సలహాగా అనిపించింది;భార్యని మెచ్చుకోలుగా చూసి "దేవీ నీ సలహా అమోఘం" అన్నాడు చాలా తృప్తిగా, సంతోషంగా!

## వేదిక:కైలాసం

మహాశివుడు ఇంటికి చేరి రాత్రి భోజనం అయిన తర్వాత పార్వతితో ఈరోజు వైకుంఠంలో జరిగిన సంభాషణలు ఏకరువు పెట్టాడు"దేవీ ఈ మానవులు కోరే ఈ కొత్త కోరిక పై నీ అభిప్రాయం ఏమిటి" అని అడిగాడు.

దానికి పార్వతి దేవి "నాథా ఈ కలియుగంలో కూడా ఇలా మానవులు అనుకోవడం కొద్దిగా వింతగా ఉన్నా ముదాహమైన విషయమే.కానీ ఒకటే నా అనుమానం- అదేమిటంటే దంపతులలో తన జీవితభాగస్వామి ప్రాణాలు విడవడం వల్ల కల్గిన బాధలో తాత్కాలిక మైన భావోద్వేగంతో ఈ భావాలు వ్యక్తం చేస్తున్నారా, లేదా మనస్ఫూర్తిగానే పోయినవాళ్ళ మీద ప్రేమతోనే అనుకుంటున్నారా- అది మీరు క్షుణ్ణంగా పరిశీలించమని నా సలహా" అని పార్వతి తన ఖచ్చితమైన అభిప్రాయం చెప్పింది.అది విన్న మహాశివుడు అలాగే,తప్పక చూస్తాను అని చెప్పాడు, నిద్రకి ఉపక్రమించారు ఇరువురూనూ.

# వేదిక: వైకుంఠం

శ్రీమహావిష్ణువు-లక్ష్మీదేవి భోజనానంతరం పాలకడలిపై శేషపాన్పు మీద కబుర్లాడుతూ ఉన్నారు- అచ్చట్లు ముచ్చట్లతో.విష్ణుమూర్తి మాటల మధ్యలో ఈరోజు త్రిమూర్తుల మధ్య జరిగిన సంభాషణ,యముడు ఇంద్రుడు వాళ్ల దగ్గరకు ఏతెంచిన వైనం చెప్పాడు మహాలక్ష్మికి! అందుకు శ్రీమహాలక్ష్మి ఇలా చెప్ప సాగింది....

"ఎవరి పాపకర్మల ప్రకారము, వారి ఋణానుబందాలు ఉన్నంత కాలం వారు భూలోకంలో ఉండాల్సిందే. జీవితభాగస్వామిని కోల్పోయినంత మాత్రాన వాళ్ళూ వాళ్ళ ప్రాణం పోతే బాగుండు అనే అగత్యం ఏముంది.వారి శేషజీవితం వాళ్ల ఆయుష్షు తీరేంత వరకూ భూలోకంలోనే ఉండాలి.వాళ్ల కోరిక ప్రకారము వాళ్ల ప్రాణాలు కూడా తీసుకువస్తే- రుణ శేషం,కర్మ శేషం మళ్ళీ తర్వాత జన్మలో పంచుకోవాల్సి వస్తుంది.అలా కాకుండా వాళ్ల ఆయుపరిమితి తీరేంతవరకు ఉండగలిగితే- ప్రస్తుతం లాగా వాళ్ల కర్మనుంచి విముక్తిపొంది జన్మరాహిత్యం పొందటానికి అవకాశం ఉంటుంది- మరుజన్మ లేకుండా అర్హులైనవారు- లేదంటే ఈ కొద్దిపాటి కర్మకోసం మరోజన్మ ఎత్తాల్సి వస్తుంది"

ఒక క్షణం ఆపి భర్తను చూస్తూ "ఆ, కాకపోతే మీరు ఒక పని చేయవచ్చు-జీవిత భాగస్వామిని కోల్పోయి మిగిలిన భాగస్వామి జీవితం ఒంటరిగా దుర్భరంగా ఉండి వాళ్ళు జీవచ్ఛవమై జీవనం కొనసాగిస్తుంటే- వాళ్లకి మాత్రమే జీవన్ముక్తిని ప్రసాదించండి-మిగిలిన ఆ కర్మని వారి తరువాత జీవితంలో కలిపేయండి- ఈ మానవులకు పూర్వజన్మ ఎలాగూ జ్ఞప్తికిరాదు కాబట్టి ఇబ్బందీ ఉండదు"

"జీవిత భాగస్వామి పోయినప్పుడు కొన్నాళ్లవరకు అక్కడ ఉన్న వాళ్లకి జీవితం నిరాశగా ఉండొచ్చు, వేదన ఉండొచ్చు.క్రమేపి ఆ ఉద్వేగంలోంచి బయటపడతారు సహజంగానే.ఏదో భావోద్వేగానికి లోనయి మానవులు అనుకున్నంత మాత్రాన మీరు సృష్టిధర్మాన్ని ఏ మాత్రం మార్చక్కరలేదు"

"మీ త్రిమూర్తులకు ఇంకా నా మాటల్లో సందేహం ఉంటే జీవితభాగస్వామి పోయిన పది పదిహేను రోజుల్లో మిగిలిన భాగస్వామికి యమభటుల్నిచెప్పమనండి- ఏదో రూపేణా- వాళ్ల ప్రాణాలు కూడా తీసుకెళ్తామని.నా ఊహప్రకారం వాళ్ళు భూలోకాన్ని వదలటానికి ఇష్ట పడరు-ఆ క్షణిక భావోద్వేగాల్లోంచి అప్పటికే బయటపడి ఉంటారు కాబట్టి;మానవుల ఈ భావన "స్మశాన వైరాగ్యం లాంటిదే"అన్నది.

విష్ణుమూర్తి మెప్పుకోలుగా లక్ష్మి వంక చూసాడు,ఆమె విశ్లేషణ, విశదీకరణ బాగున్నట్టుగా అనిపించడంతో. "అయినా ఏమి చేయాలో మీకు తెలియదా,ఏదో మా తృప్తికోసం అందరి అభిప్రాయలు అడుగుతారు గానీ" అంది.విష్ణువు ఒక చిలిపి నవ్వుతోనే సమాధానమిచ్చాడు దేవేరికి- ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు.

నిన్న మీతో అన్నాను కదా- ఇవండీ త్రిమూర్తులువారి భార్యల మధ్య నిన్నరాత్రి జరిగిన సంభాషణలు- మీ చెవిలో వేసా పొల్లుపోకుండా.

రేపు చూద్దాం త్రిమూర్తుల నిర్ణయం ఎలా ఉంటుందో.... ఏదైనా ఈ కధకు ముగింపు ఖచ్చితంగా రేపే ఉంటుంది-ఏదైనా కారణాలవల్ల సమావేశం జరగకుండా ఉంటే తప్ప!!! నిర్ణయం తీసుకోవాల్సింది వాళ్ళుకదా- నా వరకు వాళ్ళు నాకు చెప్పినది మీకు చెప్పటం వరకే! అందాక ఓపిక పట్టండి మరి.

## నాలుగవ భాగం (పెద్దాయన ముగింపు ఇవ్వడంవల్ల కొద్దిగా పెద్దది)
## వేదిక: వైకుంఠం

మరునాడు ఉదయానికి త్రిమూర్తులు మరియూ యమధర్మరాజు,ఇంద్రుడు వైకుంఠంలోని ఆంతరంగిక సమావేశమందిరానికి చేరుకున్నారు.

మహాశివుడు,బ్రహ్మదేవుడు వారివారి దంపతుల మధ్య జరిగిన సంభాషణని ప్రస్తావించారు-దాపరికం లేకుండా. ఉభయులూ కూడా ఏకకంఠంతో మహావిష్ణువుతో "మహాప్రభో,మాయొక్క,మా భార్యలయొక్క అభిప్రాయలు తెలియచేశాం,ఆ పైన మీరు ఏ విధంగా చేస్తే ధర్మవిరుద్ధం కాదో,అదేదో మీరే శెలవివ్వండి" అన్నారు.

అప్పుడు శ్రీ మహా విష్ణువు మహాదేవుడు, బ్రహ్మలతో పాటుగా అక్కడ ఉన్న యమధర్మరాజుని,దేవేంద్రుణ్ణి కూడా ఉద్దేశిస్తూ ఇలా చెప్ప సాగాడు సుదీర్ఘంగా! ఈ మానవులకు వచ్చిన కోర్కె సమంజసమైనదే-మనం ఒక్కసారి కృతయుగం నుంచి సృష్టిని పరిశీలిస్తే,ప్రతీ యుగంలోనూ కొద్దిమార్పు కనపడుతూనేవుంది ఈ మానవుల్లో.

ప్రతీ స్త్రీ సౌభాగ్యవతిగా, మాంగళ్యవతిగానే పోవాలనే కోరుకునేవారు పూర్వపు రోజుల్లో-కలియుగ ఆరంభంలోకూడా,దానికి కారణాలు మనం పరికిద్దాం-మనందరికీ తెలిసినవే అయినా కూడా- సందర్భం కాబట్టి.

ఇంటి పెద్ద అయిన భర్తని కోల్పోయిన భార్య శేషజీవితం దుర్భరమే,తన మిగిలిన జీవితాన్ని,ఎవరి మీదనో ఆధార పడుతూ,లేదా ఎవరి పంచనో చేరి గడపాల్సి వచ్చేది;ఆ స్థితి తనకు రాకూడదని ఈ విధంగా కోరుకునేది.

అదీ కాకుండా బాల్యవివాహాలు జరిగి వివాహం అయిన బాలికలు భర్తల్ని కోల్పోయి వాళ్ళ జీవితాంతం తమ పుట్టినింటిలోనూ,ఆ అమ్మాయి తల్లితండ్రులు కాలం చేసిన తర్వాత తన తోబుట్టువుల దగ్గరో,తోబుట్టువులు లేకపోతే,బంధువుల దగ్గరో జీవితాంతం కాలం గడపాల్సివచ్చేది.దీనికి తోడు చిన్నతనంలోనే విధవరాలు అయిన తర్వాత ఆ అమ్మాయి జీవితాంతం శుభకార్యాలకు వెళ్ళటానికి కూడా అవకాశం ఉండేది కాదు-మనసులో కోరిక ఉన్నా.

సొంతవాళ్ళు ఒప్పుకున్నా చుట్టూఉన్న సమాజం ఊరుకునేది కాదు,అభ్యంతర పెట్టేవాళ్ళు,ఆక్షేపించేవాళ్ళు.ఈ పరిస్థితిని చూడటంవల్ల  కూడా తర్వాతి తరం ఆడవాళ్లు సుమంగళిగానే పోవాలని కోరుకునేవారు; అలా అని వాళ్లకి జీవితం మీద తీపి-ఆశా లేదని కాదుగా!

వారి కోరిక ఎలా ఉన్నా వారి కర్మానుసారం మనం వాళ్ళఆయుష్షు నిర్ణయించేవాళ్ళం తప్ప-వాళ్ళు కోరుకున్నారని అర్ధాంతరంగా వాళ్ళ ప్రాణాలు యమపాశం తీసుకొని రాలేదు అప్పుడూ, ఎప్పుడూనూ.

అలాగే రాజులు పరిపాలించిన కాలంలో కూడా,యుద్ధంలో పరాయిరాజు చేతిలో తన భర్త మరణిస్తే -మహారాణులు,వారి స్త్రీ సంతానం సతీసహగమనం చేసేవారు; అంతఃపురకాంతలే కాకుండా ముఖ్య అనుంగు పరిచారికలు కూడా.దానికి కారణం తమ రాజ్యాన్ని గెలిచిన శత్రుదేశపురాజు అంతఃపురకాంతల్ని చెరబట్టేవాళ్ళు-ఆ స్త్రీలు అనుకూలురు అయ్యే వరకు.ఈ పరిస్థితినుంచి తప్పించుకోవడానికే ఆ స్త్రీలు ఇలా చేసేవాళ్ళు;అది చూసిన ప్రజలకు అది ఒక ఆచారంగా తయారుచేసారు ఆ నాటి సమాజంలో.

కొందరు స్త్రీలు ఇష్టపూర్వకంగా పతి చితిపై పోయేవారు,కొందర్ని బలవంతంగా సమాజంలోని పెద్దలు,చాదస్తులు చితిపై తోసేవారు- అనాగరికంగా.ఈ పరిస్థితులవల్ల స్త్రీలు తప్పనిసరి అయి ఈ దురాచారాన్ని ఆచరించేవాళ్ళు- అంతేకాని వాళ్లకి జీవితేచ్ఛ నశించికాదు-ఆ భావోద్వేగం, ఆచారాల ఒరవడిలో క్షణికావేశంలో చేసేవాళ్ళు.

అలాగే మగవాళ్ళు కూడా జీవితాంతం సహధర్మచారిణి అయిన భార్యమీదే ప్రతి విషయంలో ఆధారపడేవారు-కాడెద్దుల జోడీ లాగా.పొలం పనుల్లో పనిచేసే కాడెద్దుల్లో ఈ ఒకటి పోయినా రెండో ఎద్దు చాలా డీలా అయిపోతుంది తన భాగస్వామి లేకపోవడంతో,ఇది మనం ఇతర పశుపక్ష్యాదులలో కూడా గమనించవచ్చు.

అందుచేత భార్య పోయిన భర్త తాను కూడా పొతే బాగుణ్ణు,లేదంటే మిగిలిన జీవితంలో తన ఆలనాపాలనా ఎవరు చూస్తారు అనే భావన దృఢంగా ఉండేది మగవాళ్లలో కూడా.

యుగయూగానికి తప్పని సరిగా మార్పు జరగటం సహజం ఈ సృష్టిలో.తన ప్రాణం మీద తీపిలేని మానవులు ఉండరు కదా,మనుషులేమిటి పశుపక్ష్యాదులు కూడా తమకు ప్రాణహాని సంభవిస్తోంది అని ఊహామాత్రంగా అనిపించినా అవి వాటి ప్రాణం కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాయి-ఇది సృష్టిలోని ప్రతి ప్రాణికి సహజం!

నాగరికత పెరిగిన కొద్దీ బాల్యవివాహాలు,సతీ సహగమనాలు అంతరించిపోయాయి. దీని ప్రకారం పరికిస్తే మానవులు కోరుకునే "ఈ కొత్తకోర్కె"అందరి కోరికగా భావించి మానవజాతి కోరికగా అందరికి అంటగట్టలేము!

కలియుగం గడుస్తున్న కొద్దీ మానవుల ప్రవర్తన,వాళ్ళ జీవితాల్లో,ఆలోచనలో ఊహించని మార్పు వచ్చింది. ఎవరూ కూడా - మరొకరిపై ఆధారపడి బతుకుతున్న రోజులు కావు ఇవి,ఎవరికి వారే స్వతంత్రంగా బతుకుతున్నారు కలిసినివసిస్తున్నా- ఆర్థిక స్వాతంత్రం వచ్చిన తర్వాత.దాదాపుగా  ఏ  స్త్రీ ఈ రోజు సమాజంలో ఆర్థికంగా వేరొకరిపై ఆధారపడే పరిస్థితీ అవసరమూ లేదు.

దానికి అనుగుణంగానే వాళ్ళ ఆలోచనల్లో బతుకుల్లో పెనుమార్పులు వచ్చాయి, యమభటులు ఈ కోరికని విన్నది కొందరి దగ్గర మాత్రమే,దీన్ని పరిగణలోకి తీసుకొని మన సృష్టిధర్మాన్ని మార్చవలసిన పనేలేదు.

ఇక్కడ ఇంకోముఖ్య మైన విషయం మీముందు ప్రస్తావనకు తేవాలి సందర్భోచితం కనుక. మనమందరం ఇలా చర్చించడానికి కూర్చున్న విషయం ఏమిటి.మానవుల కోరిక- అదీ భావోద్వేగానికి లోనయినప్పుడు మనసు లోబడే పరిస్థితి.

త్రిమూర్తులమైన మనమే ఒక్కొక్కసారి దీని ప్రభావానికి లోనయిన సంఘటనలూ మనందరకూ తెలిసిన విషయమే-మరీ ముఖ్యంగా సదాశివుడితో- దానితో మనం ఎన్ని తిప్పలు పడ్డామో మనకింకా జ్ఞప్తిలోనే ఉంది కూడా.అలా అని నేనూ దాని ప్రభావానికి లోనుకాని వాణ్ణేమీ కాదే.యుగాల పూర్వపు మాటలే కాదు, ఈ మధ్య-రెండు మూడు రోజులు క్రిందట జరిగిన సంఘటన-మీకు కూడా తెలుసు కదా.

నేనూ-లక్ష్మి భావోద్వేగానికి లోనయ్యే కదా ఏ మాత్రం ఆలోచన లేకుండా ఈవెంటనే "బాలుని" పిలిపించేసాను గంధర్వలోకానికి-అతనికి పూర్ణాయుర్దాయం ఉన్నాకూడా! దాని ప్రభావం మనమంతా చూస్తూనే ఉన్నాం- భూలోకంలో అతనికోసం వాళ్ళు పడే వేదన, బాధ-ఆ రోజు మేము ఈ భావోద్వేగానికి లోనుకాకుండా ఉంటే ఇంకొన్నేళ్లు మన బాలు అక్కడ ఉండి అందర్నీ ఆనందపరిచేవాడు కదా.

ఇది పొరపాటుకాదు గాని భావోద్వేగాలకు లోనవుతే కలిగే పర్యవసానం.ఈ విషయం మొన్నామధ్య నా భక్తుడొకడు ప్రస్తావనికి తెచ్చాడు కూడా మామాటల మధ్యలో! బాలు అందరి బంధువు కాబట్టి ఇంత బాధా-వేదనానూ-భూలోకవాసులు కూడా క్రమేపీ వాస్తవాన్ని గ్రహించి వాళ్ళవాళ్ళ దైనిక జీవితంలో మునిగిపోతారు-కాల ప్రభావంలో బాలు వాళ్ళ జ్ఞాపకాల్లో,గుండెల్లో నిక్షిప్తమైపోతాడు.

అందుకే ప్రతీవాళ్ళు భావోద్వేగాల్ని-ప్రత్యేకంగా మానవులు అదుపులో పెట్టుకోవాలి ఎలాంటి సంఘటనలు వాళ్ళజీవితంలో జరిగినా- ప్రభావానికి గురికావడం మానవ సహజం.ఇప్పుడు మనం చర్చించుకునే విషయం ఆ కోవకు చెందినదే- ఈ భావోద్వేగాలు క్షణికం.

మరొక విషయం-మన జీవిత బాగస్వాములు కూడా మన ఆలోచనలకు దాదాపు దగ్గరగా ఆలోచించారు కదా.మన “దాంపత్య జీవితాల అన్యోన్యత, ఆలోచనా విధానం మానవులందరూ ఆచరించకలిగితే మనమిచ్చిన ఈ మానవజన్మ సార్ధకమే కదా వాళ్ళకి-ఆనందంతో బాటు”!

అసలు విషయానికి వచ్చి ముగింపు పలుకుదాం-ఎప్పటిలాగే “సృష్టి , స్థితి, లయలు జరుగుతాయి” క్రమ బద్ధంగా-భర్త పోయినంత మాత్రాన భార్య,భార్య పోయినంత మాత్రాన భర్త- బతకలేని పరిస్థితులు ప్రస్తుత ప్రపంచంలో లేవు-నూటికో కోటికో ఒక ప్రాణికి ఇలాంటి పరిస్థితి తటస్థించవచ్చు వారి కర్మానుసారం!

ఇలా నూటికో కోటికో జరిగే పరిస్థితి ఉన్నవారికి జీవన్ముక్తి కలిగించండి,శేషకర్మలని వారి రాబోయే జన్మలో అనుభవిస్తారు-మనిషిగానో, లేదా ఏ ప్రాణి రూపంలో గానీ- వారివారి కర్మలనిబట్టి.

శ్రీమహావిష్ణువు తన మాటలు చెప్పి ఒక పరి అందర్నీ పరికించాడు,వాళ్ళ అభిప్రాయం కోసం.అందరూ కూడా సంతుష్టులయ్యారు,శ్రీమహా విష్ణువు చెప్పింది సబబుగా ఉందన్నారు.

అప్పుడు శ్రీమహా విష్ణువు మహాశివుణ్ణి ఉద్దేశిస్తూ...

“సదా శివా,ఆ నూటికో కోటికో అనుకున్నవాళ్ళని నీవు గుర్తించి యమధర్మరాజుని ఆ ప్రకారం నడుచుకోమని ఆదేశించవచ్చు-ఇది మాత్రం పూర్తిగా నీ విచక్షణ ప్రకారమే జరుగుతుంది” అని తన తుదిమాటగా చెప్పాడు శ్రీమహావిష్ణువు.అందరూ శ్రీ మహావిష్ణువు నిర్ణయానికి సంతృప్తి చెందారు.

శ్రీమహావిష్ణువు యమధర్మరాజుని ఉద్దేశించి"యమా,ఈ విధంగానే భూలోకంలో మానవుల దగ్గరనించి ఇలాంటి విషయాలు ముందు ముందు మీ దృష్టికి వస్తే తప్పక మావద్ద ప్రస్తావించండి" అని అన్నాడు.

యముడు "తప్పక ప్రభూ" అని సమాధానిమిచ్చాడు-యమధర్మరాజు,దేవేంద్రుడు విషయం విపులంగా అర్ధం అవటంతో వారిరువురూ కూడా సంతుష్టులై త్రిమూర్తులకు తమ కృతజ్ఞతలు చెప్పి అభివందనం గావించి వారివద్ద సెలవు తీసుకుని వారివారి లోకాలకి తిరుగు ప్రయాణం అయిపోయారు.

ఇది ఒక రకంగా మానవులకి శుభవార్తే మరి-ఏదో జీవితభాగస్వామిని కోల్పోగానే భావోద్వేగంతో తాముకూడా పోవాలని అనుకునేవాళ్ళని "తథాస్తు దేవతలు" పై నుంచి ఆశీర్వదించరు-వాళ్ళని యమపాశం తాకదు-వారి ఆయువు తీరేంతవరకు!

ఏది ఏమైనా "లయకారకుడు" అయిన మహాశివుని ధ్యానం చేస్తూ ఉంటే చక్కటి ముగింపు పలుకుతాడు మన జీవితాలకి.అంతేగానీ మనమేదో చిరంజీవుల్లాగా ఈ భూమ్మీదే పాతుకుపోవాలని ఆశించడం మూర్ఖత్వమే అవుతుంది.

"జాతస్య మరణం ధృవం"-పుట్టిన వానికి మరణం తప్పదు! అందుకనే మన పెద్దలు క్రింది శ్లోకాన్ని పఠించమన్నారు-ఏదో గుడికి వెళ్ళినప్పుడే కాదు- మనసా వాచా ఇది కోరికగా ఉండాలి ప్రతి మానవునికి!

"అనాయాసేన మరణం,వినాదైన్యేన జీవనం,దేహాంతే తవసాయుజ్యం,దేహిమే పరమేశ్వరా!" ఓ పరమేశ్వరా నాకు ఈ క్రింది మూడు వరములను ప్రసాదించమని నిన్ను ప్రార్థిస్తున్నాను

1.నాకు నొప్పి,లేక బాధకాని లేని మరణాన్ని ప్రసాదించు!

2.నాకు ఎవరిమీదా ఆధారపడకుండా,నేను జీవితంలోఎవరి ముందూ తలవంచకుండా,ఎవరినీ నొప్పించకుండా,నేను ఎవరివద్దా చులకనకాకుండా ఉండే జీవితాన్ని ప్రసాదించు!

3.మృత్యువు నావద్దకు వచ్చినప్పుడు నేను నిన్ను దర్శించుకునే విధంగా దీవించు!

జీవించినంతకాలం సంతోషంగా ఉండండి, ఉంచండి...
మరి ముఖ్యంగా,చివరిగా ఇది గ్రహించగలరు...

మహావిష్ణువు మదిలో కూడా లక్ష్మీదేవి తలచినట్టుగా తానూ అదే భావనతోనే ఉన్నాడని నేను ముందే రాసుంటే మీకు ముగింపు ముందే తెలిసిపోతుంది; అందుచేత ఏ మాత్రం సూచనలు గాని ఆ వాసనగాని మీకు ఇవ్వలేదు నిన్న.వాళ్ళ సంభాషణలు అయిన తర్వాత- లక్ష్మి దేవి తన అభిప్రాయం చెప్పిన తర్వాత కూడా శ్రీమహా విష్ణువు ఏమీ మాట్లాడలేదు-"ఒక చిలిపి నవ్వు నవ్వాడు"అని రాసా అంతే!

సహజంగానే శ్రీమహావిష్ణువు- లక్ష్మీదేవుల ఆలోచనలు ఒకేరకంగా ఉంటాయి- వాళ్ళు ఈ జగత్తుకి తల్లితండ్రులు అవటంచేత-భిన్నంగా ఆలోచించారు కదా!

ఇంకో విషయం నాకు ఆనందం కలిగించేది-ఆయన ఆ రోజు "బాలు"ని గురించి నేను అడిగిన మా మాటల ప్రస్తావన తేవడం దాని పర్యవసానం కూడా వాళ్లందరికీ వివరించడం.మరోసారి మేము మాట్లాడుకునే మాటల్లో ఈ ప్రస్తావన నేను ఇంక తేవక్కర్లేదు- ఆయనే ఒప్పుకున్నాడు కదా,ఇక ఇబ్బంది పెట్టను!పై పెచ్చు ఈ విషయాలన్నీ నాకు తెలియచేయడం వల్లే కదా మీ అందరికీ చెప్పగలుగుతున్నా. ఏదైనా నాకు వైకుంఠంలో జాగా దొరికిపోయింది "స్వర్గమూ లేదు నరకమూ లేదు" మరి ఆనందం కదూ!

నాలుగు రోజులు ఓపికగా చదివినందుకు మీ అందరికీ నా కృతజ్ఞతలు.పనిలో పనిగా మీ లైకులు,బెల్లు కొట్టొద్దు-మీ అభిప్రాయం రాయండి-ముక్కు సూటిగా, కుండ బద్దలు కొట్టినట్టుగా!

## "లోకా సమస్తా సుఖినో భవంతు"

# కబుర్లు, ముచ్చట్లు

ఈ రోజు కాస్త"కబుర్ల"గురించి"ముచ్చట్లు"చెప్పుకుందాం-వాటి కథా కమామీషూ- కొద్దిగా వివరంగా,విశేషంగా!! “కబుర్లు” నిర్వచనం: విశేషాలు ఏమీ లేకపోయినా చెప్పుకునేవే కబుర్లంటే!

వాడేవాళ్లు: అందరూనూ!
వర్తించేది: అందరికీనూ!

అలా అని ఈ కబుర్లని తక్కువ అంచనా వేయలేము, ఆషామాషీగా కొట్టిపారేయలేము-ఎందుకంటే అందరికీ కబుర్లు చెప్పడం రాదుకదా-కబుర్లలో బోలెడు రకాలాయే!

| | | |
|---|---|---|
| సొల్లు కబుర్లు | ఇంస్టాగ్రామ్ కబుర్లు | హితుల కబుర్లు |
| కాలక్షేపం కబుర్లు | కాలేజీ కబుర్లు | సన్నిహితుల కబుర్లు |
| అమ్మలక్కల కబుర్లు | స్కూల్ కబుర్లు | సహోద్యోగుల కబుర్లు |
| పోసుకోలు కబుర్లు | ఆఫీస్ కబుర్లు | నిరుద్యోగుల కబుర్లు |
| సరదా కబుర్లు | ప్రేమికుల కబుర్లు | విద్యార్థుల కబుర్లు |
| సెల్లు కబుర్లు | ఆలు మగల కబుర్లు | ఇరుగుపొరుగుల కబుర్లు |
| ముఖ పుస్తకపు కబుర్లు | స్నేహితుల కబుర్లు | అమ్మాయిల కబుర్లు |
| ట్విట్టర్ కబుర్లు | అబ్బాయిల కబుర్లు | మేధావి కబుర్లు |

ఇంకా నేను కూడా  చెప్పలేనన్ని రకరకాల కబుర్లు….
ఇవి అన్నీ కూడా మన ఆరోగ్యాన్ని కాపాడే దివ్యఔషధాలే!!!
ఏది ఏమైనా ఒక్కో “కబుర్లు” ఒకోరకంగా ఉంటాయి, సారాంశం మాత్రం- సర్వసాధారణంగా “ఒట్టి కబుర్లే”!

ఇప్పుడు ముచ్చట్ల విషయానికి వద్దాం……

ముచ్చట్లు, కబుర్లు పదాలకు ఒకే అర్థం అయినా ముచ్చట్లు అనే మాటను మాత్రం ఆడవాళ్లకే ఎక్కువగా అన్వయిస్తూ ఉంటారు.బహుశా ఆడవాళ్లు మాట్లాడుకుంటూవుంటే “చూట్టానికి ముచ్చటగా ఉంటుంది కాబట్టి” (వాళ్లలాగే) ముచ్చట్లు అనే పదం వాళ్లకు ఆపాదించివుంటారు,కబుర్లు అనే పదం మగాళ్ళకి పడేసి-ఎంతైనా మన పూర్వీకులు-భావుకులు కదా- “భావకవులు” బావికవులు కాదు!!

అసలు విషయం,దాని మూలాలు – "గరికపాటి"లాంటి వారు మాత్రమే చెప్పగలరు- కానీ ఇలాంటి విషయాన్ని ఆయన్ని అడిగితే ఇంకేమైనా ఉందా-నన్ను యతి ప్రాసలతో ఓ మత్తేభంతో ఘీంకరించగలరు- నాకు కంద మూలాలు కూడా తినే యోగ్యతలేదని సెలవిచ్చేస్తారు కూడానూ.

కానీ మనం కబుర్లు ఎందుకు చెపుతాం అండీ,రోజూవారి ఉండే చికాకులు నుంచి కాస్త మనసుకు మార్పు మరియూ ఈ కబుర్లు కాస్త ఉల్లాసాన్ని ఇస్తాయి ఖచ్చితంగా-అందునా హాస్యం పాళ్ళు కలిపితే- పరవాన్నంలో జీడీ పప్పు,కిస్మిస్, నాలుగు డ్రై ఫ్రూట్ ముక్కలు నేతితో వేయించి కలిపితే అదరహాగా ఉండదూ-మరి ఈ కబుర్లు అంటే అలాగే పనిచేస్తాయి.

ఎప్పుడూ మొహం వేలాడేసుకొని,ఏదో కోల్పోయినట్టు కూచుంటే మనకీ బాగుండదు,ఇంకోడెవడు మన దరిదాపులకే చేరడు.మీరు గ్రహించి ఉంటే మనం అందరం కూడా కాస్త సరదాగా కబుర్లు చెప్పేవాళ్ళంటే ఇష్ట పడతాం.ఎంచేత? వాళ్ళ కబుర్లు "ఉల్లాసం,ఉత్సాహం" ఇస్తాయి కనక("ఉల్లాసంగా, ఉత్సాహంగా"అని ఎడవెర్టై జ్ మెంట్ వస్తుందిగదా-అలాగన్నమాట!) అంతేగానీ నవ్వేవాళ్ళు బుర్ర తక్కువ గాళ్ళు,తామే మేధావులం అనే భావన తప్పు కాదూ! ఈ కబుర్లు చెప్పడం వల్ల, వినడం వల్ల కూడా మనకు ఆరోగ్యాన్ని ఇస్తాయి.అంచేత కబుర్లు చెబుతూ ఉండండి చెప్పగలిగితే,లేకపోతే కనీసం అప్పుడప్పుడన్నా వింటూ ఉండండి.

అందునా ప్రస్తుత పరిస్థితుల్లో ఆరు నెలలనించి "ఒంటి పిల్లి రాకాసుల్లా" బతికేస్తున్నాం,అప్పుడప్పుడు బయటకి వెళ్లినా కూడా,ఇంకా ఎన్నాళ్ళో తెలియదు.అంచేత ఫోన్లో అన్నా కబుర్లు చెప్పండి, వినండి, చదవండి- కబుర్లలో కాస్త హాస్యాన్ని కలపండి-కాస్త పంచదార నోట్లో వేసుకున్నట్టు.

ఇలా చేస్తే- రోగనిరోధకశక్తి కషాయాలు, మాత్రలు వేసుకోవక్కర్లా- ఇవే ఇమ్మ్యూనిటి బూస్టర్ల లాగ పనిచేస్తాయి- కరోనా అయితే హడిలి చస్తుంది మన దగ్గరకి రావటానికి- నిజ్జం, నా మీద ఒట్టు!

ఇక ఆపుతా నా కబుర్లు, కబుర్ల పేరుతో నా కాసిని ముచ్చట్లూ చేప్పేసా ఈ రోజుకి- కడుపు నిండిపోయింది నాకైతే!

——— ———

# “ట” కారాలతో వచ్చే తిప్పలు!!!

తెలుగు అక్షరమాలలో (ఏ భాషలో అయినా అనుకోండి) ఏ అక్షరం రాకపోయినా మనం మాట్లాడలేం, గుణింతాలు రాకపోతే మాట్లాడగల్గుతాం కానీ రాయలేము. అక్షరమాలలో ఒకటి తక్కువ మరొకటి ఎక్కువ అనేదే లేదు,ఏ ఒకటి రాకపోయినా కష్టమే.

అందులో “ట” అక్షారానికి ఉన్న ప్రత్యేకత-దాని ప్రభావం ఎలాగుంటుందో చూద్దాము;
మనం నిత్యజీవితంలో బోలెడు సంఘటనలు చూస్తుంటాం,కొన్ని ఇతరుల ద్వారా వింటుంటాం-మంచివి కావచ్చు అది చెడువి కావచ్చు.ఇది చాలా చాలా సహజం ప్రతీఒక్కరి జీవితాల్లో,ఇందులో పెద్ద వింతాలేదు విశేషమూ లేదు.అలా అని ఇతరులు చెప్పేవి అన్నీనమ్మలేం కూడా-వాళ్ల కబుర్లు ముఖ్యంగా“ట”తో అంతమయ్యేటప్పుడు!

వచ్చిన తిప్పలు, ఇబ్బంది ఎక్కడంటే ఈ "ట"కారాలలోనే! మచ్చుకి కొన్ని“ట” కారాలు చూద్దాం....

మొన్న పార్కులో పక్కింటాయన, ఎదురింటావిడ మా ఫ్రెండ్ కి కనిపించారు “ట”!
వాళ్లిద్దరూ కూరలబజారులో కూడా కనపడ్డార “ట”!
ఏం లేకుండా అలా ఎలా కలుస్తున్నార “ట”!
ఆఫీస్ కాంటీన్ లో రాధా,రవి పక్కపక్కనే కూర్చొని ఒకటే గుసగుసల “ట”,
చెవులూ చెవులూ కొరుక్కుంటున్నార “ట”!
పార్కులకి పబ్బులకి కలిసి తిరుగుతున్నార “ట”!
ఆఫీస్ లో అందరూ అవే గుసగుసల “ట”!

పక్క సందులో సూర్యా రావు ఎవరో అమ్మాయితో తిరుగుతున్నాడ “ట”, ఆ అమ్మాయికి మాయరోగమా, పెళ్లిఅయిన వాడితో తిరగడం -సూర్యారావు తప్పు ఇసుమంతయినా లేదు.అసలు ఇందులో నిజం ఎంతో ఏమిటో తెలియకుండానే తీర్మానించేస్తారు, తీర్పు చెప్పేస్తారు -ఇవన్నీ "ట" ల తోనే.

ఈ మధ్యన మా ఇంటికింద ఫ్లోర్ లో ఆయన బాగా దగ్గుతున్నాడు,కోవిడ్ అయి ఉండచ్చు“ట”!

ఇలాంటి జనాన్ని చూసే వచ్చే దగ్గు ఆపుకోలేక చస్తున్నా ఆరు నెలల నుంచి నలుగురిలో!!

పూర్వం నలుగురిలో నవ్వకు అనేవారు ఇప్పుడు నలుగురిలో దగ్గటం పాపం అయిపోయింది- కోవిడ్ ని అంటకట్టేస్తున్నారు- ఏదో నేరం చేసినవాణ్ణి చూసినట్టు చూడటం, సమాజబహిష్కరణ కూడా అంటరానివాళ్ళలాగా!

దగ్గారా, మనసారా దగ్గాలంటె ఇంకా ఎన్నాళ్ళు ఆగాలో అగమ్యగోచరంగా ఉంది- అందుకే వత్తిడికి లోనవకుండా చిన్నగా దగ్గుతున్నా-మా ఆవిడకి కూడా వినపడకుండా! అసలు ఈ "ట,టా" లు వాడేవాళ్ళని సమాజం నుంచి వెలివేయాలి-కోవిడ్ ని కాదు.  వీళ్ళు దానికంటే ప్రమాదకరం జనానికి-సమాజానికి కూడాను!!

మీకుగాని ఈ "ట"కారాలు వాడేవాళ్ళు తటస్థపడితే రప్పున కొట్టండి వాళ్ల నెత్తిన! అంతేగాని ఎవరో కొట్టారు "ట" వాళ్ళని అని మాత్రం చెప్పకండి నా దగ్గరకు వచ్చి- మీరు కొట్టి వచ్చి కొట్టాను అని చెప్పండి.లేదంటే మీ నెత్తిన టపీమని నేను వేయాల్సివస్తుంది-టపా టపా "ట"కారాలతో!

ఇంకొంతమంది ఉంటారు;గోడమీద పిల్లివాటం లాగా! కొంతమంది తప్పిచ్చుకోవడానికి,వాళ్ళకి తెలిసిన విషయం అయినా వాళ్ళకి ఎక్కడ ఇబ్బంది అనో, వీళ్ళ పేర్లు మనం ఎక్కడ చెప్పేస్తామనో-ఎవరో అంటున్నారు "ట", ఎవరో అంటుంటే విన్నాం అని-వాళ్ళకి ఏమీ అంటకుండా"ట" కారాలతో తప్పించుకునే రకాలన్నమా"ట"! ఇది నేనన్నమాట కాదు-ఉన్నమాటే!

నాకుతెలిసి మీ పరిచయాల్లో కూడా ఈ "ట" కారాలవాళ్ళు ఖచ్చితంగా ఉండేవుంటారు-అవునా!!!

# ఏ విషయం లేకుండా ఉత్తిగా ఎలా రాస్తారు...

రాయడానికి ముఖ్యం కలం-కాగితం కాదు,కంప్యూటర్,లాప్ టాప్,టాబ్లెట్,మొబై ల్అసలే కాదు. మనసులో భావాలు,వ్యక్తీకరణ చేసే విధానం ముఖ్యం. కానీ "రాసేవాడికి చదివేవాడు లోకువ"అనే సామెత ఉండనే వుందిగా.ఆ సామెత పట్టుకొని ఆ వంకతో రాసేవాడికి విషయం ఏమీ లేకపోయినా అదే విషయంగా రాసేస్తాడు చెడామడా.అలాంటి రచయిత మీలో తన్నుకొస్తుంటే మాత్రం ఆపొద్దు.

ఏ విషయం లేకుండా ఉత్తిగా ఎలా రాస్తారు ఎవరైనా,కథకుడికి ఏదైనా రాయటానికి "విషయం,విషయ వస్తువు ప్రధానం" అని చెపుతారు.ఏమిటో ఇది తెలిసికూడా ఏవిషయం లేకుండా రాయాలనే ప్రయత్నం సాహసంతో కూడుకున్నదే మరి!నేను మాత్రం అలా కాదండి విషయంలేకుండా ఒక్క ముక్కకూడా ముందుకు వెళ్ళదు నా చేయి.

అన్నట్టు మీకో విషయం చెప్పాలి,నేను మొదలు పెట్టింది అందుకే మరి- మేము పదవ తరగతి చదివేటప్పుడు హిందీ భాష ఒక తప్పనిసరి సబ్జెక్ట్!

మనమేమో పదహారణాలా- కాదు నూటికి నూరుపైసల తెలుగువాళ్ళం.అందునా కోస్తా ప్రాంతం అవడం మూలాన ఒక్క హిందీ ముక్క వస్తే ఒట్టు.కోస్తా కోస్తా ప్రాంతం అంటాం కానీ మేం ఎవరినీ కోయమండీబాబు. ఏదోమాటలు కోస్తాం ఎప్పుడైనా, కొద్దిగా కోతలు కోస్తాం చేలో-పంట పొలాలు, చేలూ, వ్యవసాయం ఎక్కువ కదండీ మాకు,చేలో కోతలు మాకోస్తా వాళ్లకు అలవాటు;ఎప్పుడూ కోతల గురించి మాట్లాడుకుంటాం కాబట్టి, కోస్తాం కోస్తాం అంటాం కోస్తావాళ్ళం!

పైపెచ్చు కొద్దిగా చురుకుదనం కూడా ఎక్కువ-ఎండలు మండుతూ ఉంటాయి కాబట్టి (అసలు నిజం చెప్పేస్తున్నానండీ. సూర్యుణ్ణి హైద్రాబాదుకి మేమే పంపిస్తామండీ, ముందుగా మాదగ్గరకి రాగానే) మా చురుకుదనం ఉగ్గబట్టలేక అందరూ దాన్ని"పొగరు" అనే పదంతో మమ్మల్ని ఉట్టిపుణ్యానికి ఆడిపోసుకుంటూ వుంటారు-మేమైతే అవి ఖాతరు చేయమనుకోండి (కోస్తావాణ్ని కాబట్టి కొద్దిగా స్వగతంలో గొప్ప చెప్పుకుంటున్నా నాకు నేనే- ఇంగ్లీష్ వాడు అంటాడు కదండీ- "బ్లో యువర్ ఓన్ ట్రంపెట్" అని అలాగన్నమాట- "ట్రంప్"కూడా అదే పని చేస్తున్నాడుగా నాలుగేళ్ల నుంచి)

అసలు విషయానికి వస్తా;ఏమిటో గోదావరి కాలవగట్లలాగా నా బుర్రా,రాతా అటూ ఇటూ వెళ్తూ ఉంటాయి.అదో "బలహీనత" అని ఈ మధ్య ఓ డాక్టర్ కూడా చెప్పాడు, పైగా ఈ జబ్బు తగ్గేదికాదు అని ఏ మందులకు లొంగదు అని కూడా "చేయి నొక్కల్లా" చేతిలో చేయివేసి చెప్పాడు-జీవించేయాలి అలాగే మరి. అన్నీ మనచేతిలో ఉంటాయి అనుకుంటాం కానీ- అబద్ధం, అన్నీ తలరాత ప్రకారమే జరిగిపోతాయి!

హిందీ జవాబు పత్రం చదువుకుంటూ పోయిన హిందీ మాష్టారికి అందులో విషయం ఏమీ కనపడలా, అర్థం అవ్వటం అటుపక్క నుంచితే.వింత ఏవిటంటే ఒక్క ముక్క అర్థం అవ్వకపోయినా (అర్థం ఎందుకు అయ్యి చస్తుంది-ప్రశ్నపత్రాన్ని యధా తధంగా దించేస్తే ప్రశ్నగుర్తులు తీసేసి) అన్నిపుటలు రాశానంటే అందునా విషయం లేకుండా -హిందీవాణ్ని కూడాకాదు తెలుగు వాణ్ని-తమాషానా మరి నాతో!) చచ్చినట్టు పాస్ చేసాడు,అంత హిందీ నే రాయడం చూసి పైపెచ్చు  ముచ్చటపడ్డాడు!

ఇంతకీ నే చెప్పేది ఏమిటంటే విషయం లేకపోయినా రాసేయచ్చు,పాస్ అవొచ్చు బతుకుల్లో బతికేయచ్చు.నే రాయట్లా, బతికేయట్లా ఇప్పుడు కూడా ఇలా రాస్తూ!!!

# అలారమ్!

అలారమ్ మోగినా లేవడంలేదని మా ఇంట్లోవాళ్లు నన్నుసాధించాలని గాని, రాములవారు మాత్రం లేచారా- విశ్వామిత్రుడు "35 నిమిషాలు సుప్రభాతం" చదివితేగాని;"కౌసల్యా సుప్రజా రామా"అనగానే లేచాడు అనుకోవడానికి దాఖలాలు లేవు.వెంటనే శ్రీరాముడు లేచి ఉంటే మిగతా సుప్రభాతం చదివేవాడు కాదుగా విశ్వామిత్రుడు.

పోనీ శ్రీరాముడు లేచిన తర్వాత కూడా సుప్రభాతం చదువుతూనే ఉన్నాడు అని అనుకుంటే అది ఎందుకో నాకు నమ్మశక్యంగాలేదు.ఎందుకంటే లేచిన రాములవారు కాలకృత్యాలలో నిమగ్నం అవుతారు గానీ ఈ సుప్రభాతం వింటూ కూర్చుంటారా-విశ్వామిత్రుడి ఎదురుగా-నేను అన్నాను అనికాదు గానీ మీరూ ఆలోచించండి!

ఎందుకంటే ఆయన లేచిన తర్వాత కూడా శ్రీరాముడు ఊరుకునేవాడు కాదుగా విశ్వామిత్రుడు అలా పాడుతూఉంటే.అలారం కొట్టిన తర్వాత మనం లేచామనుకోండి,ఇంకా ఇంట్లో వాళ్ళు "లే లే" అని అంటుంటే ఊరుకుంటామా, చిరాకుపడి విసుక్కోమా ఇంట్లోవాళ్ళమీద, అదే తర్కం (లాజిక్) శ్రీరాముడుకైనా!

లాజిక్ లో ఇంకో లాజిక్ ఏంటి అంటే ఆయన మన మానవరూపంతో ఉన్నాడు- మనకు ఉండే సహజలక్షణాలు- విసుగు,చిరాకు కోపం కొద్దిగా అన్నా లేకుండా ఉంటాడా,నేను నమ్మను.ఎవరికీ తెలియకుండా సీతాదేవిని, విసుక్కునే ఉంటాడుగా.సీతాదేవి సాధ్వీమణి కాబట్టి బయట ఎవరితో అనదు-ఇప్పటి  కొందరు ఆడవాళ్ళలాగా కాదుగా F. B లో వాట్సాప్ లో, ఇన్స్టా లో,ట్విట్టర్ లో మెసేజ్ లు పెట్టడానికి- పోనీ కనీసం నారదుడికన్నా చెప్పుకుందాం అనికూడా అనుకోలా!

పైపెచ్చు లాక్ డౌన్ వల్ల ఇంట్లో కూర్చుంటున్నాను కూడా-నా ఇబ్బందిని పట్టించుకోకుండా నన్ను ఇలా ఆడిపోసుకోవడం ఏమిటి!

అలాగే లక్ష్మణుడు తన నీడకంటే అన్యాయంగా వెనకాలే ఉంటే ఆయన (శ్రీరాముడికి) ఏకాంతం "చట్టుబండలవలా"మరి.శ్రీరాముడికి లక్ష్మణుడిమీద.

పీకలదాకా (లోపల) కోపం లేకుండా ఉండదుగా ఎంత దేవుడైనా మానవరూపం దాల్చిన తర్వాత మానవుడికి ఉండే సహజలక్షణాలు లేకుండా పోవుగా కొన్ని అయినా, కొంతఅయినా;

సాక్షాత్తు శ్రీ మహా విష్ణువుకే కోపం వచ్చి లక్ష్మీదేవి మీద చిరాకుపడితే ఆవిడకీ కోపం వచ్చి భూగ్రహానికి వచ్చిఆయన్నే తిరుమలకు దింపలా దివినుండి.దానికి కారణాలు ఉన్నాయి,వాళ్ళు కారణజన్ములు అని అంటారు అంతేకదా!

నేనూ అక్కడికే వస్తున్నా, నేను కూడా వాళ్ళచేత సృష్టించబడ్డ ప్రాణినే కదా, నన్ను తక్కువ చేసుకుంటే వాళ్ళని కించిత్ అవమానం చేసినట్టే కదా.అదీకాకుండా అలారమ్ కొట్టిన తర్వాత కూడా నేను లేవడం బద్ధకించడానికి కారణాలు ఉన్నాయి మరి-వాళ్ళ ఇద్దరి కోపానికిలాగే నాకోపానికి.అంతర్జాలంలో ఉండగా "పవర్" పోయింది, "వైఫై" పని చేయట్లా, "చరవాణి శిఖరసంకేత తరంగాలు" నీరసంగా ఉన్నాయి.అంత చికాకుతో ఆలస్యంగాపడుకున్నవాణ్ణి అలారమ్ కొట్టగానే లేవలేదు అంటే చిరాకూ, కోపం రావు మరీ.నా కారణాలు నాకున్నాయి,ఆలస్యంగా లేవడానికి!

పైపెచ్చు లాక్ డౌన్ వల్ల ఇంట్లో కూర్చుంటున్నాను కూడా,నా ఇబ్బందిని పట్టించుకోకుండా నన్ను ఇలా ఆడిపోసుకోవడం ఏమిటి!

# గురువులు పలురకాలు-వాళ్ళు వేసే శిక్షలు-దండనలు వివిధ రకాలు!!!

బెత్తంతో కొట్టేవాళ్ళు కొందరు!

గోడకుర్చీ వేయించేవాళ్ళు కొందరు!

పాఠశాలలో ఆడుకునే స్థలవలయం చుట్టూ తిరగమనేవాళ్ళు కొందరు!

గుంజీళ్ళు తీయమనేవాళ్ళు కొందరు!

తరగతి గది బయట నిలబడమని చెప్పేవాళ్ళు కొందరు!

తొడపాశం పెట్టేవాళ్ళు కొందరు! ఇప్పుడు దేని గురించి చెప్పబోతున్నానో కనిపెట్టి ఉంటారు ఈపాటికి! తొడపాశం గురించి!!! దీనికి కావలసిన వస్తువులు-పదార్ధాలు-రెండే రెండు!! అవతలవాళ్ళ తొడ, మనచేయి-ఏదో ఊహించేసుకుని అపార్ధం చేసుకోకండి- పూర్తిగా నేను రాసేది చదవండి!

చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు పాఠశాలలో పిల్లకాయలు (పిల్లకాయలు కాక పెద్దకాయలు ఉంటారా అని అనబోకండి)అల్లరి చేసినా,చెప్పిన పాఠం విని అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకపోయినా,కొంతమంది గురువులు దండించే విధానంలో ఇదికూడా ఒకటి.

మన తొడమీద ఆయన చేతితో మెలిపెట్టి తిప్పేవాళ్ళు, చచ్చేంత నెప్పిపుట్టి చచ్చేది,చర్మం ఎఱ్ఱగా కందిపోయేది కూడా. ఇక్కడ కొంతమంది గురువులు ఏ కారణంచేతనో వాళ్ళు దగ్గరకు రాకుండా వేరే బెంచ్ వాళ్ళతో తొడపాశం పెట్టించేవాళ్ళు-మన బెంచిలో కూర్చునేది మన స్నేహితులేగా-తొడపాశం మెల్లిగా పెడతారు అందుకని.ఇక "ప్రశ్నలపర్వం" ఉన్న క్లాసులో ఇంకొంతమంది గురువులు- జవాబు చెప్పినవాళ్ళచేత చెప్పనివాళ్ళకి తొడపాశం పెట్టించేవారు.

ఏ ఆడపిల్లో జవాబు చెప్పిందనుకోండి, చచ్చామే!! చిన్నపిల్లలం కదా సిగ్గు అభిమానం, అవమానం ఉండేది కూడా.ఇంటికి వెళ్లి ఉడుక్కొని ఏడ్చి చచ్చేవాళ్ళం  కూడా.కొంతమంది "వెధవాయలు" మాత్రం నవ్వుతూ ఆనందంగా తొడపాశం పెట్టించుకునేవాళ్ళు ఆడపిల్లల చేత! ఇంకొందరు "ముదురు వెధవాయలు" కావాలనే జవాబులు తప్పు చెప్పేవారు- ఆడపిల్లలల చేత తొడపాశం పెట్టించుకోవడానికి అవకాశం రావచ్చుకదా అని!

పెద్దయిన తర్వాత అర్ధం అయింది వాళ్ళు ముదుర్లు,మనమే వెధవాయలం, అమాయకులం అని.

ఆడపిల్లలు మాత్రం సిగ్గుపడేవాళ్ళు!!!

ఏ గురువులు ఈ కోవకి చెందుతారో తెలుసుకాబట్టి ఆరోజు గుర్తుంటే గట్టిగా, బండగా ఉన్న లాగూ వేసుకొని పాఠశాలకి వెళ్లేవాళ్లం-"శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు" ఉండనే ఉన్నాయిగా మరి.సమాధానాలు చెప్పే తెలివిలేకున్నా
వీటికేమీ తక్కువా లేదు,లోటూ లేదు.ఈ చావు తెలివితేటలు పెద్దయిన తర్వాత అప్పుడప్పుడు ఉపయోగపడ్డాయి అనుకోండి- ఉద్యోగాల్లో.

వెనకటికి ఎవడో అన్నట్టు "జానెడు పొట్టకోసం బారెడు కష్టాలు పడాలి జీవితంలో" అని- పొట్ట జానెడయినా, బెత్తెడయినా కష్టాలు మాత్రం బోల్డన్ని బారెడ్లు ఉండేవి అనుకోండి.కానైతే కష్టం వచ్చినప్పుడల్లా "కష్టాలు మనుషులకి కాక మానులకు వస్తాయా" అని అనుకుని బండి లాగించేసా అనుకోండి- పెద్ద గొప్ప, నేనేమిటి- మీరూ అంతేగా!

నాఅంచనా ప్రకారం1975- 80లోపు పుట్టినవాళ్ళకి ఈఅనుభవం- తొడపాశం- ఉండితీరాలి, కాదంటే నమ్మను.ఆ తర్వాత పుట్టినవాళ్ళకి కూడా ఈ అనుభవంఉంటే చక్కగా,బుద్ధిగా చదివినట్టు అర్ధం;తొడపాశం పెట్టించుకున్నంత మాత్రాన తెలివిలేదు అనడం ఏమి తెలివి?

ఈ అనుభవం ఉన్నవాళ్ళు-"పెట్టినవాళ్ళు పెట్టించుకున్నవాళ్ళు" (సాధారణంగా ఈ రెండు అవకాశాలు అందరికి కొన్నిసార్లయినా వస్తాయి) సిగ్గు పడకుండా నాకు చెప్పండి-నేను ఎవరికీ చెప్పనుగా!!!

ఒట్టు-అమ్మ తోడు!!!

# చమురు!!!

“చమురు” సాధారణ భాషలో ఇంధనం,నూనె అంటారు- కానీ ఇదే పదాన్ని వివిధ సందర్భాలలో వాడటం రివాజు-సందర్భాన్ని బట్టి అర్థం మారుతుంది! చేతి చమురు: చేతిలో డబ్బులు ఖర్చవడం-వృధాగా అని భావం. మామూలు ఖర్చుకు కూడా ఈమాట వాడే లోభులుంటారు ఈ లోకంలో-అది వేరే సంగతనుకోండి! ఒంటి చమురు వదిలించుకోవడం: ఒంటికి అంటిన మలినం,మలికి, మురికి వదిలించుకునే ప్రయత్నం చేయడం ప్రతీ దీపావళికి ఒంటికి దట్టంగా శ్రేష్టమైన నువ్వులనూనెని పట్టించుకుని ఓ అరగంట పైగా ఎండలో నిలబడి,పిదప నీటితో కలిపిన సున్నిపిండితో ఒళ్లంతా పట్టించి కాసేపు ఆరనివ్వడం.

తదనంతరం ఒంటిపైఉన్న ఆ సున్నిపిండిని బాగా మెలిపి నలిపే పనిచెయ్యడం, దాని పర్యవసానంగా ఒంటికి ఉన్న మురికిని సున్నిపిండి ఆప్యాయంగా తనలో తీసుకుని మనం నలిపినప్పుడు కిందపడుతుంది!

దీపావళికి మాత్రం ఈ కార్యక్రమం తప్పనిసరి! ఈ కార్యక్రమం మధ్యలో వచ్చే కొన్ని పండుగలప్పుడు కూడా చెయ్యడం రివాజు-దీపావళికే కాకుండా! అసలు ఈ కార్యక్రమం అయిన తర్వాత స్నానం చేసి ఓ నిద్ర వేస్తే-ఇంట్లోవాళ్ళు లేపేదాకా మెలకువే రాదు- ఆ నిద్ర హాయ్ వేరు- అమర్ధం....

ఇప్పుడు షాంపూ స్నానాలు,సబ్బుతో ఒళ్ళు కడగటమూనూ ఓ బకెట్టుతో-మరి ఒంటిమురికి ఎలా వదులుతుంది. మన మనస్సులో మురికి లాగా ఒంటిమీద కూడా అలాగే కొంత ఉండిపోతుంది.దానికి తోడు మంచిబట్టలు కట్టుకుంటాం,మంచిగా మాట్లాడతామాయె-ఒంటిమీద మురికి-ఒంటిలోన మురికి పరులకు కనపడదుగా!

తల చమురు: తలకి రాసుకునే నూనెలు-ఇప్పుడు ఈ అలవాటు దాదాపుగా మృగ్యమై పోయింది; నూనె రాసే తలకాయలే కనపడవు! దీపాలు వెలగాలన్నా మన పొట్టలోకి ఏదైనా వెళ్లాలన్నా చమురు లేందే ఒక్క క్షణం గడవదు.చమురు లేకుండా మన వాహనాలు ఎలా కదలటానికి మొరాయిస్తాయో చూస్తూనే ఉన్నాం కదా!

చమురు మన నిత్యజీవితంలో చాలా ముఖ్యమైనపాత్ర పోషిస్తుంది చమురులేకుండాఒక్కరోజు కూడా గడవదు అంటే అతిశయోక్తి కాదు; చమురుకి ఇంకొక ప్రాముఖ్యత ఏంటంటే "ఇంటికి దీపం ఇల్లాలు" అన్నారు కదండీ పెద్దలు-అలాగే చమురు లేకుండా దీపం వెలగదు కదా మరి-కానీ  ఆ దీపానికి చమురు మాత్రం మాగాడేనండి-కాదంటారా!

ఇదేదో పురుషాహంకారంతో అనట్లేదు,జీవిత సత్యం- ఏ కాలమైనా.పెళ్ళీ పెటాకులు లేకుండా సహజీవనం చేసేవాళ్ళని నేను పరిగణలోకి తీసుకోలేదు మరి- అయినా వాళ్ళకీ సామెత వర్తించదుగా- వాళ్ళు ఇల్లాళ్లు కాదుగా! అందుకని వాళ్ళు కూడా నా మాటల్ని పట్టించుకోరు!

ఏదో చమురు గుర్తుకొచ్చి ఇవన్నీ గబగబా రాసేశా!

ఇక చమురు చూసినప్పుడు,గుర్తుకొచ్చినప్పుడు-ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని అనవసరంగా చేతి చమురు మాత్రం వదిలించుకోకండి!